సాక్షి
జనగామ
గురువారం | 8 | ఆగస్టు | 2024



జాలువారుతున్న జలపాతాలు

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో జలపాతాలు పరవళ్లు తొక్కుతున్నాయి. దీంతో పర్యాటకులు అధిక సంఖ్యలో ఆయా జలపాతాలను సందర్శించారు. - 8లో▸



బదిలీలా.. పదోన్నతులా?

బదిలీలు, పదోన్నతులపై విద్యుత్ ఉద్యోగుల్లో గందరగోళం నెలకొంది. కొందరు ఉద్యోగులు బదిలీల కోసం, మరికొందరు పదోన్నతి కోసం ఎదురుచూస్తున్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$30^0/23^0$

వాతావరణం

ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై చల్లని వాతావరణం ఉంటుంది. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు తగ్గుతాయి.

అట్టుడికిన ‘జనగామ’

ఓ వైపు ఆర్టీసీ కార్మికులు.. మరోవైపు న్యాయవాదులు

- కండక్టర్ సస్పెన్షన్‌ని నిరసిస్తూ డిపో ఎదుట 9గంటలపాటు ధర్నా
- సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్. అధికారులతో చర్చలు
- న్యాయవాద దంపతులపై చేయి చేసుకున్నారని పోలీసులపై ఆరోపణలు
- కోర్టు విధులు బహిష్కరించి ర్యాలీ నిర్వహించిన న్యాయవాదులు
- ఇతర జిల్లాల బార్ ప్రతినిధుల మద్దతు

తోటి కండక్టర్ సస్పెన్షన్‌పై ఆర్టీసీ కార్మికుల మహాధర్నా.. న్యాయవాద దంపతులపై పోలీసుల దాడికి వ్యతిరేకంగా న్యాయవాదుల నిరసన హోరుతో జిల్లా కేంద్రం బుధవారం అట్టుడికిపోయింది. ఆర్టీసీ కార్మికుల ఆందోళనతో సుమారు తొమ్మిది గంటల పాటు జనగామ డిపో బస్సులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. జనగామ కోర్టులో న్యాయవాదులు వరుసగా రెండో రోజు విధులను బహిష్కరించగా.. వీరికి మద్దతుగా ఇతర జిల్లాలనుంచి బార్ అసోసియేషన్ల ప్రతినిధులు తరలివచ్చారు. నిరసనల హోరుతో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను చక్కబెట్టడానికి డీసీపీ రాజమహేంద్రనాయక్ ఆదేశాల మేరకు ఏసీపీ పార్థసారథి, శర్మ ఆధ్వర్యాన వెస్ట్‌జోన్ పరిధి ఏసీపీ, సీఐ, ఎస్సైలు, పోలీసు సిబ్బంది బందోబస్తు చేపట్టారు.
- జనగామ





ఆర్టీసీ డిపో ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు, (ఇన్‌సెట్‌లో) పాల్గొన్న కండక్టర్, కుటుంబ సభ్యులు

ఆర్టీసీ బస్సులో సీటు విషయమై జరిగిన గొడవ నేపథ్యంలో జనగామ డిపోలో పని చేస్తున్న కండక్టర్ భూక్యా శంకర్‌నాయక్‌ను సంస్థ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. దీంతో బాధిత కండక్టర్.. కుటుంబ సభ్యులతో పాటు తోటి కార్మికులు ఆందోళనకు దిగారు. న్యాయం చేయాలని జనగామ డిపో ఎదుట బుధవారం ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బైఠాయించారు. దీంతో డిపోలో 100కు పైగా ఉన్న సంస్థ, అద్దె బస్సులు ఎక్కడికక్కడ నిలిచి పోయాయి. సిద్దిపేట, ఉప్పల్, హనుమకొండ, సూర్యాపేట, నర్మెట, హుస్నాబాద్, బచ్చన్నపేట తదితర రూట్లలో 9 గంటల పాటు బస్సులు లేక వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జనగామ జిల్లాతో పాటు సమీప జిల్లాల పరిధి గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. మధ్యాహ్నం నుంచి సిద్దిపేట డిపోకు చెందిన బస్సులను జనగామ వరకు నడిపించడంతో కొంతమేర ఇబ్బందులు తప్పాయి. హనుమకొండ, ఉప్పల్ నుంచి వచ్చే ఇతర బస్సులు బస్టాండ్‌లోకి వచ్చే పరిస్థితి లేక బయటి నుంచే వెళ్లిపోయాయి. చేసేది లేక వందల సంఖ్యలో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలకు వచ్చే విద్యార్థులు అష్టకష్టాలు పడుతూ జిల్లా కేంద్రానికి చేరుకోగా.. చాలా మంది పిల్లలు ఇళ్లకే పరిమితమయ్యారు.

విచారణ తర్వాతే సస్పెన్షన్ : ఆర్ఎం

కండక్టర్‌పై వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి ఆరు రోజుల తర్వాత సస్పెండ్ చేసినట్లు ఆర్ఎం డి.విజయభాను తెలిపారు. కార్మికుల ఆందోళన నేపథ్యంలో తిరిగి శాఖాపరమైన విచారణ చేపట్టి సస్పెన్షన్‌కు సంబంధించిన ప్రకటన చేస్తామన్నారు. సంస్థకు ప్రయాణికులే దేవుళ్లు.. ఉద్యోగులు సైతం మర్యాదగా వ్యవహరించాలని చెప్పారు. అదే సమయంలో సంస్థ ఉద్యోగులపై ఎవరైనా అసభ్యకర రీతిలో వ్యవహరించినట్లయితే ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు ఉంటాయన్నారు.

సస్పెన్షన్ ఎందుకంటే..

హనుమకొండ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే జనగామ డిపో బస్సులో ఈ నెల 1వ తేదీన ఓ మహిళ, రెండేళ్ల బాబు, ఆమె తల్లి ఎక్కారు. ఈ క్రమంలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ గర్భిణి అదే బస్సులో ఎక్కారు. ‘గర్భిణికి సీటు ఇవ్వాలని సదరు మహిళను కోరాగా నిరాకరించింది. ఆ తర్వాత ఇష్టం వచ్చినట్లు మాట్లాడిన ఆమె మడికొండ వద్ద దిగిపోయి సంస్థ ఉన్నతాధికారులకు తనపై ఎక్స్ వేదికగా ఫిర్యాదు చేసినట్లు’ కండక్టర్ చెప్పారు. ఆరు రోజుల తర్వాత ఆర్టీసీ అధికారులు విచారణ జరిపి ఈనెల 6న కండక్టర్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. కండక్టర్ వాదన ఇలా ఉంటే.. ఆర్టీసీ ఉన్నతాధికారులు మాత్రం.. అనారోగ్యంతో ఉన్న తల్లితో పాటు రెండేళ్లబాబు ఉన్న మహిళపై కండక్టర్ దురుసుగా ప్రవర్తించాడని.. అలాగే బలవంతంగా బస్సు నుంచి కిందకు దింపాడని.. విచారణలో వెల్లడైనట్లు విలేకరులకు తెలిపారు. ఇదిలా ఉండగా.. ఫిర్యాదు చేసిన మహిళ బూతులు తిడుతూ తనపైనే ఆగ్రహం వ్యక్తం చేసినట్లు కండక్టర్ అంటున్నారు.

రెండు దఫాలుగా చర్చలు

కండక్టర్‌పై సస్పెన్షన్ ఎత్తి వేసే వరకు ఆందోళన విరమించేది లేదని కార్మికులు తేల్చి చెప్పారు. ఉమ్మడి వరంగల్ ఆర్ఎం డి.విజయభాను, డిప్యూటీ ఆర్ఎంఓ కె.భానుకిరణ్, కరీంనగర్ జోన్ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి బాబూరావు, జనగామ, హనుమకొండ డీఎంలు స్వాతి, బి.ధరంసింగ్ ఆధ్వర్యాన ఆయా రాజకీయ పార్టీల నాయకులు, న్యాయవాది సాధిక్ అలీ, చెంచారపు శ్రీనివాస్ రెడ్డి, మోకు కనకారెడ్డి తదితరులతో కార్మికుల తరఫున చర్చలు జరిపారు. విచారణ చేపట్టి పదిహేను రోజుల తర్వాత సస్పెన్షన్ ఎత్తివేతపై ప్రకటన చేయిస్తామని అధికారులు చెప్పడంతో కార్మికులు ససేమిరా అన్నారు. తిరిగి రెండో దఫా చర్చలు ప్రారంభించిన అనంతరం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న కార్మికుల వద్దకు వచ్చి నచ్చజెప్పారు. వారం రోజుల్లో పోస్టింగ్‌తో పాటు బదిలీ చేయకుండా ఇక్కడే పోస్టింగ్ ఇచ్చే విధంగా హామీ ఇచ్చారని చెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ విషయంలో మాటతప్పితే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మధ్యాహ్నం 2.30 గంటలకు బస్సులను పునరుద్ధరించారు.



చర్చలు జరుపుతున్న నాయకులు, అధికారులు

కోర్టు విధుల బహిష్కరణ - న్యాయవాదుల ర్యాలీ

న్యాయవాద దంపతులు అమృతరావు, కవితపై పోలీసుల దాడిని నిరసిస్తూ జనగామ కోర్టులో రెండో రోజు బుధవారం విధులను బహిష్కరించారు. దాడికి పాల్పడిన పోలీసులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎనగందుల చంద్రరుషి ఆధ్వర్యాన అడ్వకేట్లు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వీరికి మద్దతుగా వరంగల్, భూపాలపల్లి, పరకాల, సిద్దిపేట, రంగారెడ్డి, సూర్యాపేట, హైదరాబాద్, మంచిర్యాల, కొత్తగూడెం జిల్లాలకు చెందిన బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వచ్చారు. పోలీసులు, బార్ అసోసియేషన్ ప్రతినిధుల మధ్య ఉదయం, మధ్యాహ్నం చర్చలు జరిగాయి. సీఐతోపాటు దాడిలో పాల్గొన్న ఎస్సై, పోలీసు సిబ్బందిని సస్పెండ్ చేసి కేసు నమోదు చేయాలని పట్టుబట్టారు. చర్చలు విఫలం కావడంతో కోర్టు ఆవరణ నుంచి ఆర్టీసీ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించగా.. పోలీసులు బందోబస్తు చేపట్టారు.

రాష్ట్ర వ్యాప్తంగా విధుల బహిష్కరణ

జనగామలో న్యాయవాద దంపతులపై పోలీసుల దాడిని నిరసిస్తూ గురువారం(నేడు) నుంచి రెండు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా అడ్వకేట్లు కోర్టు విధులను నేడు బహిష్కరించి నిరసన తెలుపనున్నారని జనగామ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎనగందుల చంద్రరుషి తెలిపారు. ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు విధులను బహిష్కరించి నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతారని, అలాగే జిల్లా కోర్టు ఆవరణలో దీక్షలతో పాటు వంటా, వార్పు కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

న్యాయవాదుల ఫిర్యాదుపై కేసు నమోదు



ర్యాలీ అనంతరం ఆర్టీసీ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

పోలీసులు, న్యాయవాదుల మధ్య జరిగిన వివాదంలో మహిళా న్యాయవాది కవిత ఫిర్యాదు మేరకు సీఐ, ఎస్సై, ఇతర సిబ్బందిపై జనగామ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయడంతోపాటు శాఖాపరమైన విచారణ ప్రారంభించారు. ఈ మేరకు స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మను విచారణ అధికారిగా నియమించినట్లు వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్ తెలిపారు.

ఆస్తిపన్ను పెంపుపై సమీక్షించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్‌సీ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, పక్కన కమిషన్ సభ్య కార్యదర్శి స్మితా సబర్వాల్, కమిషన్ సభ్యులు నెహ్రూనాయక్, సుధీర్‌కుమార్, అధికారులు

చిన్న గ్రామ పంచాయతీలతో స్థానిక సంస్థలకు ఇబ్బందులు

- రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య
- మూడంచెల విధానం మేలు : ఎమ్మెల్యే సత్యనారాయణరావు
- స్థానిక సంస్థల పనితీరుపై ఎస్ఎఫ్‌సీ ఉమ్మడి వరంగల్ సమావేశం

హన్మకొండ అర్బన్: స్థానిక సంస్థల పరిధిలో ఆస్తి పన్ను పెంపు సమీక్షించాలని రాష్ట్ర ఆర్థిక సంఘం (ఎస్ఎఫ్‌సీ) చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అన్నారు. అతి చిన్న గ్రామ పంచాయతీలు, మండలాలు, జిల్లాల ఏర్పాటు వల్ల స్థానిక సంస్థల్లో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని, కొన్నిచోట్ల పైసా ఆదాయం లేని జీపీలు ఉన్నాయని పేర్కొన్నారు. స్థానిక సంస్థలు ఆర్థిక పరిపుష్టి సాధించేందుకు నూతన అవిష్కరణలతో ముందుకు రావాలన్నారు. బుధవారం హనుమకొండ కలెక్టరేట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని అన్ని జిల్లాల అధికారులతో స్థానిక సంస్థల పనితీరు, నిధుల రాబడి, ఖర్చు తదితర అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ స్థానిక సంస్థలకు కావాల్సిన నిధులు ప్రభుత్వం విడుదల చేస్తుందని తెలిపారు. ఇవేకాకుండా స్వయంగా సమకూర్చుకునే పద్ధతులపై దృష్టి సారించాలన్నారు. ఖర్చుల విషయంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. గ్రామ పంచాయతీలు స్థానికంగా నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి ఏర్పాటు చేసే ప్రచార బోర్డులు,జాతరల పన్నులు వసూలు చేయాలన్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో ఐదంచెల విధానం తీసేసి మూడంచెల విధానం తీసుకురావాలని సూచించారు. ఐదంచెల విధానం వల్ల స్థానిక సంస్థలకు అధికారం,నిధులు లేకుండా రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారాయన్నారు. జీపీలకు నిధులు కేటాయింపు, సిబ్బంది వేతనాలు, వాహనాల నిర్వహణ తదితర అంశాలపై సభ్యులు పలు సూచనలు చేశారు. హనుమకొండ డీపీఓ లక్ష్మీరమాకాంత్ మాట్లాడుతూ చిన్న గ్రామ పంచాయతీల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందన్నారు. ఒకరిద్దరు పారిశుద్ధ్య కార్మికులు ఉండటం వల్ల పాతశాలలు, గ్రామాల్లో పనులు చేయలేకపోతున్నారన్నారు. కరెంటు బిల్లు, ఈఎంఐలు, ఇతరత్రా వాటికి నిధులు విడుదల చేయాలని కోరారు. కమిషన్ సభ్య కార్యదర్శి స్మితా సబర్వాల్ మాట్లాడుతూ గ్రామపంచాయతీలకు వచ్చిన నిధుల కేటాయింపులో ఎస్సీ, ఎస్టీలకు, మహిళా సంక్షేమానికి నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు భూక్య మురళినాయక్, కేఆర్ నాగరాజు, సభ్యులు నెహ్రూనాయక్, సుధీర్‌కుమార్, రమేష్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు వెంకట్ రెడ్డి, సంధ్యారాణి, లెనిన్ వత్సల్ టొప్పో, పింకేశ్‌కుమార్, శ్రీజ, ఆయా జిల్లాల డీపీఓలు, జెడ్పీ సీఈఓలు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

‘చేనేత’ చిరస్థాయిగా నిలవాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: భావితరాలకు ‘చేనేత’ చిరస్థాయిగా నిలిచిపోవాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో జనగామ బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన చేనేత ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా నేతన్నలను అభినందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ చేనేత వస్త్ర ధారణ భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా ఉండాలని అన్నారు. జిల్లాలో దాదాపు 18వేల మంది చేనేత కార్మికులున్నారని, 2వేల చేనేత మగ్గాలకు జియో ట్యాగింగ్ చేశామని చెప్పారు. జీయోగ్రఫీ ఇండికేటర్ జోన్‌లో మాత్రమే వస్త్రాల తయారీ చేయాలని, డూప్లికేట్ వస్త్రాలు తయారు చేస్తే కేంద్ర వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వ శాఖకు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. సంప్రదాయ వస్త్రాలతో పాటు మారుతున్న అభిరుచులకు అనుగుణంగా డిజైన్ ఉండాలని సూచించారు. మహిళా శక్తి పథకం ద్వారా చేనేత మహిళా కార్మికులు లబ్ధి పొందాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చేనేత ప్రాధాన్యతపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వ్యాస రచనలో ఎం.శిరీష మోడల్ స్కూల్ జఫర్‌గఢ్ ప్రథమ, ఎం.దీపిక లింగాలఘణపురం కేజీబీవీ ద్వితీయ, పి.హారిక, జెడ్పీ ఎస్ఎస్ గానుగుపహాడ్ తృతీయ, ఎన్.రమ్య వాణీహైస్కూల్ బచ్చన్నపేట నాలుగో స్థానంలో నిలిచారు. వక్తృత్వంలో ఎ.వీక్షిత, జెడ్పీ ఎస్ఎస్ ధర్మకంచ జనగామ ప్రథమ, డి.వందన, టీజీఆర్ఎస్ కొడకండ్ల ద్వితీయ, కె.యశస్విని బిషప్ తుమ్మలబాల బచ్చన్నపేట తృతీయ, కె.అక్షర, జెడ్పీఎస్ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్ నాలుగో స్థానంలో నిలువగా వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమున, వార్డుకౌన్సిలర్ భూలక్ష్మి పాల్గొన్నారు.



చేనేత మహిళా కార్మికురాలిని సన్మానిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, పక్కన అదనపు కలెక్టర్

కోలుకొండ నేతన్నకు పురస్కారం

దేవరుప్పుల: చీరలపై ఓరుగల్లు వీర వనిత రుద్రమదేవి డిజైన్ రూపొందించిన జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కోలుకొండ గ్రామానికి చెందిన పాము భిక్షపతికి కొండా లక్ష్మణ్ బాపూజీ పురస్కారం లభించింది. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం హైదరాబాద్ పీపుల్స్ ప్లాజా వద్ద జరిగిన కార్యక్రమంలో భిక్షపతికి పురస్కారంతో పాటు జ్ఞాపికను చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు పాము మోహన్, నల్ల సత్యనారాయణ, పాము గోపి, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు సామల పరమేశ్వర్, నాయకుడు కామని శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.



పురస్కారం అందుకుంటున్న భిక్షపతి



పురస్కారం పొందిన చీర డిజైన్ ఇదే..

న్యూస్‌రీల్

డీఆర్డీఓగా వసంత బాధ్యతలు



జనగామ: జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి(డీఆర్డీఓ)గా ఎం.వసంత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. ప్రస్తుత డీఆర్డీఓ మొగులప్ప నారాయణపేట జిల్లాకు బదిలీపై వెళ్లారు. కాగా జిల్లాకు వచ్చిన వసంత గతంలో ఇక్కడ పనిచేసి, వికారాబాద్ వెళ్లగా తిరిగి జనగామకు వచ్చారు.

నూతన ఆలోచనలకు పదును పెట్టాలి

- అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్



జనగామ రూరల్: ప్రతీ ఒక్కరిలో సృజనాత్మకత, వ్యక్తిగత ప్రతిభ ఉంటుంది.. నూతన ఆలోచనలకు పదును పెట్టాలని అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ వద్ద ఉన్న ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఇన్నోవేటర్ ప్రచార కార్యక్రమాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. పాఠశాల నుంచి నెహ్రూపార్క్ వరకు విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా జీవనానికి అవసరమైన ఆవిష్కరణలు అవసరమని, విద్యార్థులు, యువత, గ్రామీణ ప్రజలు మహిళలు ఇన్నోవేటర్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జీసీడీఓ గౌసియాబేగం, హెచ్ఎం కృష్ణమూర్తి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఈడీఎం గౌతమ్, ఎస్సై తిరుపతి పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బందికి సేఫ్టీ జాకెట్ల పంపిణీ



జనగామ: జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యుత్ విభాగం 1, 2 సెక్షన్ల పరిధి సబ్‌స్టేషన్ సిబ్బందికి సేఫ్టీ జాకెట్లను ఎన్పీడీసీఎల్ జిల్లా ఎస్ఈ వేణుమాధవ్ పంపిణీ చేశారు. అనంతరం డీఈ విజయ్‌కుమార్, ఎమ్మార్టీ ఏడీ వేణుగోపాల్, ఏఈ శంకర్, ఇన్‌చార్జ్ ఏఈ మనోహర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. జనగామలో ట్రాన్స్‌ఫార్మర్ ఫీజులు కాలిపోకుండా.. అంతరాయం లేని విద్యుత్ సరఫరా చేయాలన్నారు. సాంకేతిక సమస్యలను సత్వరమే పరిష్కరించాలని చెప్పారు. డబుల్ ఫీడర్ పరిధిలో ప్రమాదకరమైన లైన్లను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు.

చీటకోడూర్ రిజర్వాయర్‌కు నీరు విడుదల చేయాలి

జనగామ : పట్టణ ప్రజల దాహార్తి తీర్చే చీటకోడూర్ రిజర్వాయర్‌లోకి అశ్వరావుపల్లి రిజర్వాయర్ నుంచి సత్వరమే నీరు విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జనగామ పట్టణం, పరిసర ప్రాంత ప్రజలకు తాగునీరు, వ్యవసాయ భూములకు సాగు నీటి విషయంలో నెలకొన్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుత్ దుర్వినియోగాన్ని అరికట్టాలి : ఎస్ఈ

జనగామ : విద్యుత్ దుర్వినియోగాన్ని అరికట్టి అవినీతి రహిత వ్యవస్థకు వినియోగదారులు సంపూర్ణ తోడ్పాటు అందించాలని ఎన్పీడీసీఎల్ జనగామ ఎస్ఈ బి.వేణుమాధవ్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. గతంతో పోల్చితే నాణ్యమైన విద్యుత్ సరసమైన ధరకు సంస్థ అందిస్తున్నదని అన్నారు. ‘లంచం ఇవ్వకండి.. అడిగితే సమాచారం ఇవ్వండి-లంచం ఇవ్వడం, తీసుకోవడం చట్టరీత్యా నేరం(అవినీతి నిరోధం చట్టం-1988)’ అని తెలిపే వాల్ స్టిక్కర్లు, ఫోం బోర్డులను సర్కిల్ పరిధి అన్ని కార్యాలయాలు, సబ్‌స్టేషన్లలో ఏర్పాటు చేశామని తెలిపారు. వాస్తవిక ఫిర్యాదులను ఫోం బోర్డు, స్టికర్లపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి లేదా టోల్ ఫ్రీ 1064 నంబరుకు లేదా 9281033233 మొబైల్ నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు.

ఉపకరణాలు ఆత్మస్థైర్యాన్ని నింపుతాయి

- జిల్లా విద్యాధికారి రాము



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ రాము

జనగామ రూరల్: ఉపకరణాలు దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతాయని డీఈఓ రాము అన్నారు. బుధవారం తెలంగాణ సమగ్ర శిక్ష, హైదరాబాద్ ఆధ్వర్యాన దివ్యాంగులకు చేపట్టిన ప్రత్యేక గుర్తింపు శిబిరాన్ని ఆయన ప్రారంభించి స్క్రీనింగ్ నిర్వహించారు. అనంతరం ఐఈఓ కోఆర్డినేటర్ బి.నర్సింహారావు అధ్యతన ఏర్పాటు చేసిన సమావేశంలో డీఈఓ మాట్లాడుతూ.. దివ్యాంగ పిల్లలు విద్యలో రాణించడానికి ఉపకరణాలు ఎంతో ఉపయోగపడుతాయని, ఈ క్యాంపులో వారికి ఎలాంటి పరికరాలు అవసరమో గుర్తించినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 18 ఏళ్ల లోపు 103 మంది దివ్యాంగులు పాల్గొన్నారని, అర్హులకు ప్రత్యేక సమావేశం నిర్వహించి ఉపకరణాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు వరుణ్, అవినాష్, మోహన్, నోడల్ ఆఫీసర్ రాజేందర్, విజేందర్, రాజా, నీరజ, ప్రవీణ్, నాగరాజు, విజయ పాల్గొన్నారు.

వినియోగదారుల సమస్యలు తక్షణమే పరిష్కరిస్తాం

- ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ సదన్‌లాల్



సహాయ సేవా కేంద్రాన్ని ఆన్‌లైన్‌లో ప్రారంభిస్తున్న సదన్‌లాల్

చిల్పూరు: విద్యుత్ వినియోగదారులకు ఎక్కడ సమస్య వచ్చినా తక్షణమే పరిష్కరిస్తామని ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ సదన్‌లాల్ అన్నారు. రాజవరం సబ్‌స్టేషన్ పరిధి మల్కాపూర్, చిల్పూరు గ్రామాల్లోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లను ఆయన బుధవారం జనగామ ఎస్ఈ వేణుమాధవ్, స్టేషన్‌ఘన్‌పూర్ డీఈ హుస్సేన్‌నాయక్, రాజవరం, స్టేషన్‌ఘన్‌పూర్ ఏఈలు రమేష్, చంద్రమోహన్‌లతో కలిసి సందర్శించారు. ముందుగా మల్కాపూర్ సబ్‌స్టేషన్‌లో మొక్కలు నాటారు. అనంతరం చిల్పూరు సబ్‌స్టేషన్‌లో వినియోగదారుల సేవా కేంద్రం(హెల్ప్ లైన్ డెస్క్) ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సదన్‌లాల్ మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి 20 సెక్షన్‌లలో హెల్ప్‌లైన్ డెస్క్‌లు ప్రారంభించామని చెప్పారు. ఇక నుంచి రైతులకు, వినయోగదారులకు విద్యుత్ పరంగా ఎలాంటి సమస్య వచ్చినా ఇక్కడకు వచ్చి ఆన్‌లైన్‌లో సమస్యను నమోదు చేయిస్తే వెంటనే పరిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ వినీత్‌రెడ్డి, సిబ్బంది వడ్డేపల్లి యాదగిరి, కాంతయ్య, కృష్ణమూర్తి, తిరుపతి, అశోక్, రత్నాకర్, రాజిరెడ్డి, విజయ్‌కుమార్, సాంబరాజు, సురేష్, సిద్దయ్య, నాగరాజు, మాటూరి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం

జనగామ: తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది.. పుట్టిన శిశువుకు గంటలోపు తల్లిపాల(ముర్రు)ను పట్టించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం చంపక్‌హిల్స్ మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రంలో సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తల్లిపాలలో శిశువుకు కావలసిన అనేక పోషక పదార్థాలు ఉంటాయని, వాటితో రోగనిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. బిడ్డ జన్మించిన తర్వాత ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే తాగించాలని, ఆ తర్వాత అదనపు ఆహారంతో పాటు రెండేళ్ల వరకు తల్లిపాలు పట్టాలని సూచించారు. ఈ విషయమై అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ప్రసూతి వార్డులో బాలింతల యోగక్షేమాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావు, సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్, డీఎంహెచ్ఓ డాక్టర్ హరీశ్‌రాజ్, సీడీపీఓ రమాదేవి, ఏసీడీపీఓ సత్యవతి, రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాళేశ్వరాలయంలో నైమిశారణ్యం పీఠాధిపతి పూజలు


మంగపేట: పీఠాధిపతికి వేదాశీర్వచనం ఇస్తున్న పూజారులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరుడిని నైమిశారణ్యం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ బాల బ్రహ్మానంద సరస్వతి స్వామి బుధవారం దర్శించుకున్నారు. దేవస్థాన రాజగోపురం వద్ద అర్చకులు, వేద పండితులు ఆయనకు పూర్ణ కుంభ స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలో విశేష పూజలు చేశారు. శ్రీశుభానందాదేవి, శ్రీమహాసరస్వతి అమ్మవార్లను దర్శించుకున్నారు. శుభానందాదేవి(పార్వతి) అమ్మవారి ఆలయంలో పీఠాధిపతికి ఆలయ ఈఓ మారుతి, అర్చక స్వాములు, వేదపండితులు స్వామివారి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం పీఠాధిపతి.. భక్తులకు ప్రవచనాలు వినిపించారు. కార్యక్రమంలో దేవస్థానం సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

హేమాచలుడి సన్నిధిలో ..

మంగపేట : మండలంలోని మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహాస్వామిని నైమిశారణ్యం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ బాల బ్రహ్మానంద సరస్వతి బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి కై కర్యం రాఘవాచార్యులు.. బాల బ్రహ్మానంద సరస్వతి పేరిట అర్చన జరిపించి స్వామివారి శేష వస్త్రాలు బహూకరించారు. వేదాశీర్వచనం ఇచ్చి స్వామవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బోదకాలు నిర్మూలనపై డబ్ల్యూహెచ్ఓ ఆరా


వివరాలు తెలుసుకుంటున్న డబ్ల్యూహెచ్ఓ బృందం

కొత్తగూడ: ఏజెన్సీ గ్రామాల్లో బోదకాలు నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలపై డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రతినిధి బృందం బుధవారం మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సందర్శించింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు కొత్తగూడ, గంగారం, కోమట్లగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారులతో సమావేశమయ్యారు. ఏయే గ్రామాల్లో బోదకాలు కేసులు గుర్తించారు.. వారికి ఎలాంటి చికిత్స అందించారు.. మిగతా వారికి వ్యాపించకుండా ఉండేందుకు ఎలాంటి చర్యలు చేపట్టారని ఆరా తీశారు. అనంతరం బోదకాలు బాధితులతో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి మందులు అందుతున్నాయని తెలుసుకున్నారు. ఇకముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో డబ్ల్యూహెచ్ఓ ప్రతినిధి సుధీర్‌రెడ్డి, పీఓ నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.



బదిలీలా.. పదోన్నతులా?





ప్రక్రియ రంగం సిద్ధం చేసిన టీజీ ఎన్పీడీసీఎల్
- పదోన్నతులు కల్పిస్తేనే ఖాళీలపై స్పష్టత
- జాబ్ క్యాలెండర్‌లో పేర్కొన్న విధంగా నోటిఫికేషన్‌కు మార్గం సుగమం
- పదోన్నతులు కల్పించాలని యూనియన్ల డిమాండ్

హన్మకొండ : బదిలీలు, పదోన్నతులపై విద్యుత్ ఉద్యోగుల్లో గందరగోళం నెలకొంది. దీర్ఘకాలంగా ఒకే చోట పని చేస్తున్న ఉద్యోగులు బదిలీల కోసం ఎదురు చూస్తుండగా.. సీనియారిటీలో ఉన్న ఉద్యోగులు తమకు ఎప్పుడు పదోన్నతి కల్పిస్తారో అని ఎదురు చూస్తున్నారు. టీజీ ఎన్పీడీసీఎల్‌లో పదోన్నతులు కల్పించడంలో ఆలస్యమైన కొద్దీ ఆశావహులు రిటైర్డ్ అవుతున్నారు. 20 ఏళ్లుగా ఒకే పోస్టులో విధులు నిర్వర్తించి తమకు పదోన్నతి లభిస్తుందని ఎదురుచూసిన ఉద్యోగులకు చివరికి ఉద్యోగ విరమణ తప్పడం లేదు. ప్రధానంగా ఇంజనీరింగ్ విభాగంలో 20 ఏళ్లుగా ఏడీలుగా పని చేసిన అధికారులు డీఈ పదోన్నతి కోసం, డీఈలుగా పని చేసి ఎస్ఈగా పదోన్నతి కోసం, అదే విధంగా అకౌంట్స్ విభాగంలోనూ నాలుగేళ్లుగా పదోన్నతి కోసం ఎదురుచూసి చివరకు జూలైతో రిటైర్డ్ అయి మానసిక క్షోభకు గురైన వారున్నారు. ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో బదిలీలకు అవకాశం కల్పించింది. జూలై 31 వరకు బదిలీలకు అవకాశం కల్పించింది. అయినా వివిధ కారణాలతో విద్యుత్ సంస్థల్లో బదిలీల ప్రక్రియ మొదలు కాలేదు. ప్రస్తుతం విద్యుత్ సంస్థల యాజమాన్యాలు బదిలీలకు మార్గదర్శకాలు సిద్ధం చేశాయి. ఈ క్రమంలో టీజీ ఎన్పీడీసీఎల్‌లోనూ బదిలీలకు మార్గదర్శకాలు సిద్ధమయ్యాయి. నేడో రేపో మార్గదర్శకాలు విడుదలవుతాయని ఆశావహులు ఎదురుచూశారు.

ముందు పదోన్నతులపై తేల్చాలి..

పదోన్నతుల చిక్కుముడి వీడకుండా బదిలీలు చేపడితే సమన్యాయం జరగదని విద్యుత్ ఉద్యోగ సంఘాలు, అసోసియేషన్లు నిర్ణయానికి వచ్చాయి. పదోన్నతులు దక్కాల్సిన వారు రిటైర్డ్ అవుతుండడంతో అధికారులు, ఉద్యోగ వర్గాల్లో ఆందోళన కలుగుతోంది. ఈ క్రమంలో ముందు పదోన్నతులపై తాడో పేడో తేల్చుకోవాలని యూనియన్లు, అసోసియేషన్లు ముందుకువచ్చాయి. దీంతో విద్యుత్ సంస్థలు టీజీ జెన్‌కో, టీజీ ట్రాన్స్‌కో, టీజీ ఎస్పీడీసీఎల్, టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీలకు నోటీసులు అందించాయి. పదోన్నతులు కల్పించాకే బదిలీలు చేపట్టాలని నోటీసులో పేర్కొన్నాయి. పదోన్నతులు చేపట్టకపోతే ఆందోళనలు చేపడుతామని, అవసరమైతే మెరుపు సమ్మెకు దిగడానికి వెనుకాడబోమని హెచ్చరించాయి. దీంతో బదిలీలు చేపట్టాలని నిర్ణయానికి వచ్చి మార్గదర్శకాలు రూపొందించుకున్న విద్యుత్ సంస్థల యాజమాన్యాలు సందిగ్ధంలో పడ్డాయి. ఫలితంగా బదిలీల ప్రక్రియ ఆలస్యమయ్యే అవకాశముందని విద్యుత్ ఉద్యోగ వర్గాలు తెలిపాయి.

వివాదాస్పదంగా పదోన్నతుల ప్రక్రియ

పదోన్నతుల ప్రక్రియ ఏ విధంగా చేపట్టాలనే అంశం వివాదాస్పదంగా మారింది. మెరిట్ కమ్ సీనియారిటీ ఆధారంగా పదోన్నతులు కల్పించాలని, రిజర్వేషన్ కమ్ రోస్టర్ విధానంలో పదోన్నతులు చేపట్టాలని ఉద్యోగ వర్గాలు వేర్వేరుగా డిమాండ్ చేస్తున్నాయి. ఈ అంశంపై ఆయా వర్గాలు కోర్టులను ఆశ్రయించాయి. పదోన్నతుల్లో మెరిట్ ఆధారంగా చేపట్టాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని ఓసీ, బీసీ ఉద్యోగ వర్గాలు చెప్పుతుండగా.. గతంలో మాదిరి రిజర్వేషన్ రోస్టర్ పద్ధతిలో పదోన్నతులు కల్పించాలని ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ అంశం కోర్టులో పరిధిలో ఉండడంతో యూనియన్లు, అసోసియేషన్లు కోర్టు, ప్రభుత్వ నిర్ణయానికి అనుకూలంగా తదుపరి నిర్ణయం ఉంటుందని కండీషన్ పెట్టి పదోన్నతులు కల్పించాలని కోరుతున్నాయి. తద్వారా పదోన్నతుల సమస్యకు చెక్ పడుతుందని అధికార, ఉద్యోగ వర్గాలు భావిస్తున్నాయి. బదిలీలకు మార్గం సుగమం అవుతుందని విద్యుత్ ఉద్యోగులు తెలిపారు.

జాబ్ క్యాలెండర్ విడుదల

రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేసింది. ఇందులో భాగంగా విద్యుత్ సంస్థల్లో ఖాళీలకు అక్టోబర్‌లో నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పింది. ఈ క్రమంలో పదోన్నతులు కల్పించకుంటే కింది స్థాయి ఉద్యోగ ఖాళీలపై ఎలా స్పష్టత వస్తుందని ఉద్యోగ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. పదోన్నతులు కల్పిస్తేనే అక్టోబర్‌లో విడుదల చేసే ఉద్యోగ భర్తీ నోటిఫికేషన్‌లో ఖాళీలపై స్పష్టత వస్తుందని పేర్కొంటున్నాయి. దీంతో పదోన్నతులు, బదిలీలపై చిక్కుముడి నెలకొంది. పదోన్నతులు కల్పించకుంటే ఆందోళనకు దిగుతామని యూనియన్లు, అసోసియేషన్లు హెచ్చరించిన క్రమంలో విద్యుత్ సంస్థల యాజమాన్యాలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటాయో వేచి చూడాల్సి ఉంది. దీంతో బదిలీల ప్రక్రియ మరింత ఆలస్యం కానుంది.

నేడు కేయూ పాలకమండలి సమావేశం!

- వీసీ నియామకానికి యూనివర్సిటీ ఈసీ నామిని ప్రతిపాదన
- ఎజెండాలో బోధన, బోధనేతర సమస్యలు..?

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సమావేశం ఈనెల 8న (నేడు) సాయంత్రం 4గంటలకు హైదరాబాద్‌లోని రూసాభవనంలో నిర్వహించనున్నారని సమాచారం. పాలకమండలి సభ్యుల నియామకం తరువాత పూర్తిస్థాయి తొలి సమావేశం జరగబోతోంది. ఇందులో కేయూ ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ, ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం, కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, ఇతర పాలకమండలి సభ్యులు పాల్గొనబోతున్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా కేయూ వీసీ నియామకానికి సంబంధించి సెర్చ్ కమిటీకి సభ్యుడిగా ఒకరిని కేయూ పాలకమండలి తరఫున ఖరారు చేసి ప్రతిపాదించబోతున్నారని తెలిసింది. వీసీ నియామకానికి ప్రభుత్వం నియమించే సెర్చ్ కమిటీలో ముగ్గురు సభ్యులు ఉంటారు. యూజీసీ నామిని, యూనివర్సిటీ ఈసీ నామిని, ప్రభుత్వ నామిని ఉంటారు. అందుకే ఈ పాలకమండలి సమావేశమై యూనివర్సిటీ ఈసీ నామినిని ప్రతిపాదించబోతుంది. ఎజెండాలో

బోధన, బోధనేతర ఉద్యోగుల సమస్యలు?

కేయూలో 2013 నియమితులైన బోధనేతర ఉద్యోగుల పీఆర్‌సీ 2020కి సంబంధించి వర్తింపజేసే విషయంలో పాలకమండలిలో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారని సమాచారం. టైంస్కేల్ ఉద్యోగులకు సంబంధించి క్యాష్ కాంపేన్సేషన్ రూ. 5లక్షల నుంచి రూ. 7లక్షల 50వేలవరకు పెంపుదలకు పాలకమండలి ఆమోదానికి ఎజెండాలో చేర్చినట్లు సమాచారం. ఇదిలా ఉండగా 2010లో నియమితులైన అసిస్టెంట్ ప్రొఫెసర్లు తమకు పదోన్నతుల కల్పించాలని కూడా పలుమార్లు యూనివర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై పాలకమండలిలో చర్చిస్తారాలేదా అనేది ఆసక్తికరంగామారింది.

అయిలయ్య డిమోషన్‌ను తొలగించేనా?

కేయూ సోషియాలజీ విభాగం ఆచార్యుడు కుంట అయిలయ్యను సంవత్సరం క్రితం క్రమశిక్షణ చర్యలలో భాగంగా ప్రొఫెసర్ స్థాయినుంచి అసోసియేట్ ప్రొఫెసర్‌గా డిమోషన్ చేశారు. ఈ విషయంలో కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం (అకుట్) బాధ్యులు ఇటీవల రిజిస్ట్రార్‌ను కలిసి అయిలయ్యను ప్రొఫెసర్‌గా యథావిధిగా కొనసాగించాలని కోరారు. అదేవిధంగా అకుట్ జనరల్ సెక్రటరీ అసోసియేట్ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారికి ప్రొఫెసర్‌గా పదోన్నతి కల్పించలేదు. దీనిపై పాలకమండలి సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని ఇస్తారి ఇటీవల రిజిస్ట్రార్‌ను కోరినట్లు సమాచారం. దీనిని కూడా పాలకమండలి ఏజెండాలో పెడుతారాలేదా అనే అంశం చూడాలి.

సెంట్రల్ లేబర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా ఆనంద్

- ప్రకటించిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్
- తెలంగాణ, ఏపీ రాష్ట్రాల నుంచే ఒక్కరే ఎంపిక


ఆనంద్

చెన్నారావుపేట : సెంట్రల్ లేబర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్‌గా అంగోతు ఆనంద్ ఎంపికయ్యారు. జూలై 5వ తేదీ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఫలితాలు వెలువడగా.. మంగళవారం సెంట్రల్ లేబర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ పోస్టుకు తనను ఎంపిక చేసి ప్రకటించినట్లు ఆనంద్ బుధవారం తెలిపారు. దీంతో ఆనంద్‌ను కుటుంబసభ్యులతోపాటు గ్రామస్తులు అభినందించారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం బోజేర్వు శివారు జగ్గు తండాకు చెందిన అంగోతు భద్రయ్య, అరుణ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు సంతోశ్ జాతీయ ఖనిజ అభివృద్ధి సంస్థలో మైనింగ్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. చిన్న కుమారుడు ఆనంద్ ప్రస్తుతంసెంట్రల్ లేబర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. భద్రయ్య ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, అరుణ ఎంజీఎంలో మెడ్‌కో సోషల్ వర్కర్ (ఎంఎస్‌డబ్ల్యూ)గా విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి ఆనంద్ ఒక్కరే సెంట్రల్ లేబర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్‌గా ఎంపిక కావడం విశేషం. ఎస్టీ రిజర్వేషన్ కేటగిరీలో ఆనంద్ మొదటి ర్యాంకు సాధించారు. కాగా, చెన్నైలో పెట్రోలియం కార్పొరేషన్‌లో ఉద్యోగం చేస్తూ ఖాళీ సమయంలో ఆన్‌లైన్ ద్వారా పోటీ పరీక్షలకు సన్నద్ధమైనట్లు ఆనంద్ తెలిపారు.

బస్సును తప్పించబోయి అనంతలోకాలకు..

- బైక్ అదుపు తప్పి ఒకరి దుర్మరణం
- గుండేడులో ఘటన


శ్రీనివాస్ (ఫైల్)

కమలాపూర్ : బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి బస్సును తప్పించబోయి అనంతలోకాలకు చేరాడు. వాహనం అదుపు తప్పి పడడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గుండేడు శివారులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో నెట్ సెంటర్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లికి చెందిన బొద్దుల శ్రీనివాస్ (40) బుధవారం కంప్యూటర్ కొనుగోలు చేయడానికి తన బైక్‌పై హనుమకొండకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుండేడు శివారులో ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయాడు. దీంతో బైక్ అదుపు తప్పి పడడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న కుటుంబీకులు, బంధువులు హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు.

చెక్‌డ్యామ్ దాటుతూ వాగులో పడి వ్యక్తి మృతి

- లక్ష్మీపురం, దొనకొండ గ్రామాల మధ్య ఘటన


పెంటయ్య (ఫైల్)

దంతాలపల్లి : చెక్‌డ్యామ్ దాటుతూ పాలేరు వాగులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం దంతాలపల్లి మండలం లక్ష్మీపురంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దోరపల్లి పెంటయ్య(55) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఓ ఫంక్షన్ నిమిత్తం మంగళవారం సూర్యాపేట జిల్లా పోలుమల్ల గ్రామంలోని తన (భార్య సోదరి) మరదలు ఇంటికి వెళ్లాడు. ఫంక్షన్ అనంతరం బంధువులతో కలిసి స్వగ్రామం వస్తున్నాడు. మార్గమధ్యలో తన బంధువులు పెంటయ్యను మద్దిరాల మండల కేంద్రం వద్ద దింపివెళ్లారు. అక్కడి నుంచి తనకు తెలిసిన వారితో కలిసి దొనకొండ గ్రామం చేరుకున్నాడు. వర్షం కురుస్తుండడంతో అక్కడే ఉన్న తమ బంధువుల ఇంటి వద్ద విశ్రాంతి తీసుకున్నాడు. అనంతరం స్వగ్రామం లక్ష్మీపురానికి కాలినడకన వస్తున్నాడు. ఈ క్రమంలో లక్ష్మీపురం, దొనకొండ గ్రామాల మధ్య ఉన్న పాలేరు వాగులో చెక్‌డ్యామ్ దాటుతూ అందులో పడి మృతి చెందాడు. వాగులోకి చేపలు పట్టడానికి వెళ్లిన వారు చూసి సమాచారం అందించడంతో గ్రామస్తులు ఘటనాస్థలికి చేరుకుని పోలీసులకు విషయం తెలిపారు. దీంతో ఎస్సై రాజు సిబ్బందితో కలిసి ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య వెంకటమ్మ, కుమారుడు యాకన్న ఉన్నారు. యాకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

జాలువారుతున్న జలపాతాలు..


వాజేడు: బొగత జలపాతం

- బొగత, పాండవుల, బొల్లి జలపాతాలు పరవళ్లు
- పర్యాటకుల సందడి


బయ్యారం పెద్దగుట్ట పై నుంచి జాలువారుతున్న జలపాతం

రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో జలపాతాలు పరవళ్లు తొక్కుతున్నాయి. ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి సమీపంలో ఉన్న బొగత జలపాతం, మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలోని పెద్దగుట్టపై ఉన్న పాండవుల జలపాతం, చింతోనిగుంపు సమీపంలోని బొల్లి జలపాతాలు జాలువారుతున్నాయి. దీంతో బుధవారం పర్యాటకులు అధికసంఖ్యలో ఆయా జలపాతాలను సందర్శించారు. జాలువారుతున్న నీటిని చూసి ఎంజాయ్ చేశారు.

వాజేడు/బయ్యారం

మత్తడి పోస్తున్న లక్నవరం..




మత్తడి పోస్తున్న లక్నవరం సరస్సు

గోవిందరావుపేట: రైతుల కల్పతరువు.. ప్రకృతి అందాలకు నిలయం లక్నవరం. ఈ సరస్సు ప్రస్తుతం నిండుకుండలా మారి మత్తడి పోస్తోంది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు సరస్సులోకి 34 ఫీట్ల మేరకు వరద వచ్చి చేరడంతో అలుగు పోస్తోంది. దీంతో లక్నవరం అందాలు తిలకించేందుకు పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- రైల్వే డిప్యూటీ కమర్షియల్ చీఫ్ ఆఫీసర్ వెంకన్న


రైల్వే స్టేషన్‌ను సందర్శిస్తున్న అధికారుల బృందం

నెక్కొండ: నెక్కొండ రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రైల్వే డిప్యూటీ కమర్షియల్ చీఫ్ ఆఫీసర్ వెంకన్న అన్నారు. రైల్వే ప్రత్యేకాధికారుల బృందం బుధవారం నెక్కొండ రైల్వే స్టేషన్‌ను సందర్శించింది. ఈ నెల 1న మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు నెక్కొండ రైల్వే స్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్‌తోపాటు ఫుట్ ఓవర్ బ్రిడ్జి పొడిగింపు తదితర సమస్యలపై వినతిపత్రం అందించారు. తక్షణమే రైల్వే అధికారుల ప్రత్యేక బృందం పంపాలని ఎంపీ, ఎమ్మెల్యేలు చేసిన విజ్ఞప్తితో ఆ శాఖ మంత్రి ఆదేశాల మేరకు అధికారుల బృందం స్టేషన్‌ను సందర్శించింది. స్టేషన్‌లో అసంపూర్తిగా ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ప్రయాణికుల తాగు నీటి కుళాయిలు, ప్లాట్‌ఫామ్‌లు పరిశీలించింది. అనంతరం టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, రైల్వే అవర్నెస్ ఫోరం కన్వీనర్ వెంకట్‌నారాయణ, బీజేపీ మండల అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రమేశ్‌యాదవ్, పలువురు.. ప్రత్యేక అధికారులను కలిశారు. ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలుతోపాటు శాతవాహన, నవజీవన్, షిర్డీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని కోరారు. దీనికి స్పందించిన అధికారుల బృందం.. ఈ రైల్వేస్టేషన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం రైల్వే ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని హామీ ఇచ్చింది. కార్యక్రమంలో రైల్వే అసిస్టెంట్ కమర్షియల్ ఆఫీసర్ మూర్తి, రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు అంబాల రాంగోపాల్, రాపాక సందీప్, బీఆర్ఎస్ నాయకుడు కొమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి, ఫోరం సభ్యులు నేతల సారంగపాణి, జువ్వాజి మాణిక్యం, పొట్లపెల్లి వీరస్వామి, తాటిపాములు వెంకటేశ్వర్లు, కేవీ సుబ్బారెడ్డి, కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, రావుల మహిపాల్‌రెడ్డి, ఈ.సాయికృష్ణ పాల్గొన్నారు.

కళాసంపద.. కనుమరుగు!

కాకతీయుల చారిత్రక కట్టడాలపై నిలువెత్తు నిర్లక్ష్యం
- శిథిలావస్థలో వరలక్ష్మి దేవాలయం, రాతి, మట్టికోటలు
- గుప్త నిధులు కోసం దుండగుల తవ్వకాలు
- పట్టించుకోని పురావస్తు అధికారులు


గుండు చెరువు సమీపంలో వరాలమ్మ గుడి


భూమి దిగువన కాకతీయులతో పూజలందుకున్న వరలక్ష్మి గుడి

ఖిలా వరంగల్ : పాలకుల పట్టింపులేని తనం.. అధికారుల అలసత్వం.. గుప్తనిధి వేటగాళ్ల దుశ్చర్య.. వెరసి చారిత్రక ఖిలా వరంగల్ కోటలోని విలువైన చారిత్రక శిల్ప కళా సంపద కనుమరుగవుతోంది. భావితరాలకు భద్రంగా అందించాల్సిన చారిత్రకట్ట కట్టడాలు, శిల్ప కళా సంపద పట్టింపు లేక కుంచించుకుపోతోంది. ఫలితంగా తెలుగు రాష్ట్రాలను ఏకం చేసిన కాకతీయుల ఆనవాళ్లు కూడా కాపాడుకోలేని దుస్థితి కనిపిస్తోంది. శతాబ్దాల పాటు ఓరుగల్లును పాలించిన కాకతీయుల కాలంలో మొత్తం ఏడుకోటలు ఉండేవి. ప్రస్తుతం వాటి చుట్టూ నగరం విస్తరించడంతో క్రమేనా కాలగర్భంలో కలిసిపోయాయి. నేడు కాకతీయ రాజధాని చుట్టూ రాతి, మటికోటలు మాత్రమే ఉన్నాయి. అవి కూడా పునర్నిర్మాణం లేక శిథిలమవుతున్నాయి. కోటలను తవ్వి సమాధులు మాయం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో గుప్త నిధుల వేటగాళ్లు, ఆకతాయిల వల్ల శిల్ప కళా సంపద ధ్వంసమవుతోంది.

శిథిలావస్థలో వరాలమ్మ గుడి..

మధ్యకోట గుండు చెరువు సమీపంలో కాకతీయులతో పూజలందుకున్న వరాలమ్మ గుడి శిథిలావస్థకు చేరుకుంది. ఆలనాపాలన లేక కాలగర్భంలో కలిసిపోతోంది. ఈ గుడికి సుదీర్ఘ చరిత్ర ఉందని చరిత్రకారులు చెబుతున్నారు. అంతఃపురం నుంచి సొరంగా మార్గం ద్వారా కాకతీయ రాజులు, రాణులు వరాలమ్మ గుడికి చేరుకుని నిత్య పూజలు చేసేవారని ప్రచారంలో ఉంది. చిల్డ్రన్ పార్క్ నుంచి గుండుచెరువు అంచున వరలక్ష్మి గుడి భూమి పైభాగానే కనిపిస్తుంది. ఆ గుడికి రెండు మీటర్ల దూరంలో భూగర్భంలో అద్భుతమైన శిల్ప కళా సంపదతో కూడిన మరో వరాలమ్మ గుడి కనిపిస్తుంది. భూమికి 15ఫీట్ల దిగువన సుందర గుడి ఉంటుంది. వరాలమ్మగుడిని సందర్శించాలంటే మెట్ల మార్గం ద్వారా లోపలికి వెళ్తే విశాలమైన రెండు గదులు కనిపిస్తాయి. ప్రస్తుతం గుడిగోపురంతోపాటుపై కప్పు పూర్తిగా ధ్వంసమైంది. ఈ గుడి నేలమడిగెలో ఉండడం వల్ల బయటి ప్రపంచానికి ఎక్కువ తెలియదు. గుప్తనిధుల కోసం గుడిని ఎక్కడికక్కడే ధ్వంసం చేశారు. ప్రస్తుతం వరాలమ్మ గుడి పైకప్పు కూలిపోయి పిచ్చిమొక్కలతో కనిపిస్తోంది.

కనుమరగవుతున్న చరిత్ర ..

కాకతీయుల రాజధాని చుట్టూ మొత్తం చిన్న, పెద్ద 115 ఆలయాలు ఉన్నాయని చరిత్రకారులు చెబుతున్నారు. ప్రతి ఆలయం శిథిలావస్థకు చేరిందని, గర్భగుడిలో విగ్రహాల ధ్వంసమై కనిపిస్తున్నాయని వారు పేర్కొంటున్నారు. మధ్య, తూర్పు కోటకు వెళ్ల ప్రధాన రహదారిలో శివాలయం శిథిలావస్థకు చేరింది. అలాగే, బావులు కూడా శిథిలమై కనిపిస్తున్నాయి. గుప్త నిధులున్నాయనే ఆశతో దుండుగులు అడుగడుగునా తవ్వకాలు జరిపారు. కోట పరిసరాల్లో ఎన్నో అద్భుత ఆలయాలున్నా పర్యాటకులు దర్శించలేని పరిస్థితి కనిపిస్తోంది. కోట గోడలు కూలిపోతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడని పర్యాటకులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చారిత్రక సంపదను కాపాడాలి



కాకతీయుల పాలనకు నిలువెత్తు సాక్ష్యంగా నిలిచే చారిత్రక సంపదను కాపాడాలి. పునర్నిర్మాణం లేక రాతి, మట్టి కోటలు కనుమరుగవుతున్నాయి. కబ్జాదారుల ఆగడాలతో చెరువులు కుంచించుకుపోతున్నాయి. మట్టికోట చుట్టూ శ్మశాన వాటికలు, సమాధులే దర్శనమిస్తున్నాయి. వరాలమ్మగుడి పైకప్పు ధ్వంసమై ఏళ్లు గడుస్తున్నా పట్టింపులేదు. భూగర్భంలో ఉన్న చారిత్రక కట్టడాలను వెలికితీసి పర్యాటకంగా అభివృద్ధి చేయాలి.

శివాజీ, మధ్యకోట